‘కోట’లో విదేశీయుల సందడి



గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు గత నెల రోజుల నుంచి పర్యాటకుల తాకిడి విపరీతంగా పెరిగింది. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు కోటను చూడడానికి భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. గత వారం రోజులుగా కోటకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు కోటలోని క్లాపింగ్ పోర్టికో, రాణిమహల్, భక్త రామదాసు చరసాల, కోటలోని ఫిరంగులను ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మంత్రి సీతక్కకు ఆహ్వానం



చార్మినార్: చార్మినార్ సమీపంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 23న నిర్వహించే వైకుంఠ(ముక్కోటి ఏకాదశి) మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మంత్రి సీతక్కకు దేవాలయం ప్రధాన పూజారి అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 23వ తేదీ నుంచి జనవరి 16వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్న విషయాన్ని ఆయన మంత్రికి వివరించారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి.



ఎమ్మెల్యేతో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

గోల్కొండ: అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యేను కలిశారు. హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలం ఉందని ఈ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని అసోసియేషన్ కార్యానిర్వహక అధ్యక్షులు ముత్యాల భాస్కర్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులున్నారు. సందర్భంగా అసోసియేషన్ వారు ఎమ్మెల్యేను శాలువా కప్పి పూలమాలలు ఇచ్చి సన్మానించారు.

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుదాం

గోల్కొండ: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ తన సత్తాచాటుతుందని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చిందని ఆయన విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు పరచాలని ఆయన అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాబలం తమకు ఎంత ఉందో బీజేపీ చాటుకుందని వచ్చే ఎన్నికల్లో అత్యధిక పార్లమెంటు స్థానాలు గెలిచి తాము సత్తాచాటుతామని ఆయన అన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించిన డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్‌హుస్సేని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పలు శాఖల ఉద్యోగుల సమస్యలు త్వరలోనే నూతన మంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీఎన్జీఓస్ తరపున హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్ హుస్సేని ఘనంగా సత్కరించి అభినందించారు.

సివిల్ జడ్జిగా మైక్రో ఆర్టిస్ట్ రామగిరి స్వారిక ఎంపిక



రామగిరి స్వారిక

గౌలిపురా: గౌలిపురా అంబికానగర్ ప్రాంతానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ రామగిరి స్వారిక జూనియర్ సివిల్ జడ్జి ఉత్తీర్ణత సాధించారు. మైక్రో ఆర్టిస్ట్‌గా ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్న రామగిరి స్వారిక 2023 పోటీ పరీక్షల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సామాన్య పేద ప్రజలకు సామాజిక న్యాయం అందజేయాలనే ఉద్దేశ్యంతో తన జీవిత ఆశయంగా ఎంబీఏ పూర్తి చేసిన అనంతరం ఎల్ఎల్‌బీ విద్యనభ్యసించానని రామగిరి స్వారిక తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం అందించేటట్లు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మణికొండ: పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు అండగ నిలుస్తూ, అవసరమైన సౌకర్యాలను సమకూరుస్తామని వెరిట్రా ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్‌లు ఆచంట గోపినాథ్, మాసు బాలాజీరెడ్డిలు అన్నారు. గురువారం మణికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన 32 ఫ్యాన్లు, 1 ల్యాప్‌టాప్, 5 క్రికెట్ కిట్‌లు, షటిల్ బ్యాట్స్, 400 మ్యాజిక్ స్లేట్స్‌లాంటి అనేక వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం తల్లితండ్రుల ఆర్థిక పరిస్థితి వల్లే వారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారన్నారు. అలాంటి వారికి కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో సౌకర్యాలను కల్పిస్తే వారు చదువుల్లో మరింత రాణిస్తారన్నారు. అలాంటి వారికి తమ సంస్థ అండగా ఉంటుందని, అన్ని రకాల సౌకర్యాలను రాబోయే రోజుల్లో కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, నార్సింగి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, మణికొండ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, సంస్థ సిబ్బంది అనురాధ, శ్రీదేవి, శ్వేత, రాఘవేందర్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతబస్తీ ప్రజల్లో

సంతోషం..

మెట్రోపై సీఎం రివ్యూపై హర్షం

- వెంటనే క్షేత్రస్థాయి పరిశీలనతో నివేదిక కోరిన సీఎం
- ఏళ్ల తరబడి ఎదురు చూపులకు ఇక ఫుల్‌స్టాప్..
- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా ద్వారా ఎయిర్‌పోర్టు వరకు..
- 12న ‘పాతబస్తీకి మెట్రోపై కొత్త ఆశలు’ అనే శీర్షికతో ‘సాక్షి’ కథనం..



ఫలక్‌నుమాలో మెట్రో కోసం కేటాయించిన స్థలం (ఫైల్)



చార్మినార్: ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇక పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులకు మోక్షం కలుగుతుందని బావించిన పాతబస్తీ ప్రజలకు ఊరట లభించింది. ఎన్నో ఏళ్లుగా మెట్రో రైలు కోసం ఇక్కడి ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈసారైనా పాతబస్తీ నుంచి మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాలని పాతబస్తీ ప్రజలు కోరుతుండడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్‌యంఆర్‌ఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డి తదితర అధికారులతో బుధవారం సమావేశమై రివ్యూ నిర్వహించిన విషయం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ విషయం తెలుసుకున్న పాతబస్తీ ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మెట్రో రైలు పనులకు మోక్షం కలుగుతున్నందున సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- గతంలో పాతబస్తీలో మెట్రో పనులు చేపట్టకపోవడం పట్ల పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. 2018 ఎన్నికల సందర్భంగా పాతబస్తీలో మెట్రో రైలు తెరపైకి తెచ్చి ఎన్నికల ప్రచారంలో వినియోగించుకున్నారు. అయితే ఎన్నికలు ముగిసిన అనంతరం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. తిరిగి 2023 ఎన్నికలు జరగడం మెట్రో రైలు ప్రస్తావన రావడం..పరిపాటిగా మారింది.

ఉద్యోగులు, వ్యాపారస్తులకు ఉపయోగం



పాతబస్తీలో మెట్రో రైలు పనుల ప్రారంభానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం ఆనందంగా ఉంది. మెట్రో అందుబాటులోకి వస్తే.. స్థానిక ఉద్యోగులతో పాటు వ్యాపారులకు సైతం సౌకర్యంగా ఉంటుంది.

– రాకేష్ తివారీ, వ్యాపారి–లాల్‌దర్వాజ

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా ద్వారా ఎయిర్‌పోర్టు వరకు...

ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో పాతబస్తీ ప్రజల్లో మెట్రో పట్ల ఆశలు చిగురించాయి. ఈ విషయాన్ని ‘పాతబస్తీకి మెట్రోపై ‘కొత్త ఆశలు’ అనే శీర్షికతో ఈనెల 12న ‘సాక్షి’ దిన పత్రికలో ప్రముఖంగా ప్రచురించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విషయాన్ని సంబంధిత కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఇక ఈ విషయంపై ఈ నెల 13న సీఎం రేవంత్‌రెడ్డి హెచ్‌యంఆర్‌ఎల్ ఎండీతో రివ్యూ నిర్వహించి వెంటనే కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. ముందుగా అనుకున్నట్లు పాతబస్తీలో 5.5 కిలో మీటర్ల దూరానికి మెట్రో పనులు ప్రారంభించాల్సి ఉంది. పాతబస్తీ ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ బస్ డిపో ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. సాధ్యమైనంత వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు అక్కడి నుంచి చాంద్రాయణగుట్ట,బార్కాస్,పహాడీషరీఫ్ ద్వారా ఎయిర్‌పోర్టు వరకు కారిడార్ ఏర్పాటుకు నివేదికలను రూపొందించి తమకు అందజేయాలని సీఎం ఆదేశించడంతో పాతబస్తీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాతబస్తీకి ఎంతో అవసరం..



ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమకు మెట్రో సౌకర్యం వస్తుండడం సంతోషంగా ఉంది. ఇక్కడ మెట్రో ఎంతో అవసరం. పాతబస్తీలో మెట్రో పనుల జాప్యం తగదు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మెట్రో పనులు జరుగ లేదు.

– గాజుల అంజయ్య, మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయం కమిటీ చైర్మన్

యూ టర్న్‌ల వద్ద అక్రమ పార్కింగ్‌లు



టూమ్స్ చౌరస్తా సమీపంలో అక్రమ పార్కింగ్‌లతో మూతపడ్డ యూ టర్న్.

గోల్కొండ: యూ టర్న్‌లు అక్రమ పార్కింగ్‌ల కారణంగా ఉపయోగంలోకి రాకుండా పోతున్నాయి. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూ టర్న్‌లను ట్రాఫిక్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనాదారులు ఆరోపిస్తున్నారు. టోలిచౌకీ, షాగౌస్ హోటల్, గెలాక్సీ సెంటర్, టూమ్స్ చౌరస్తా–షేక్‌పేట్ రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రయాణికుల సౌకర్యం కోసం యూ టర్న్‌లు ఏర్పాటు చేశారు. అయితే అత్యంత రద్దీగా ఉండే టోలిచౌకీ షాగౌస్ హోటల్ ముందు ఉన్న యూ టర్న్ ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కొంత కాలం క్రితం ప్రయోగాత్మకంగా ట్రాఫిక్ పోలీసులు ఈ యూటర్న్‌ను ప్రారంభించారు. అయితే రెండురోజుల్లోనే ఈ యూటర్న్ వద్ద తికమకకు గురికావడంతో మూసి వేశారు. మళ్లీ వారం తరువాత యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు. దీంతో వాహనాల యూటర్న్ తీసుకునే సమయంలో వెనుక నుంచి వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

- పాత ముంబాయి జాతీయ రహదారి గెలాక్సీ సెంటర్ వద్ద ఉన్న యూటర్న్ నిర్వహణను కూడా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. యూ టర్న్ తీసుకుంటున్న వాహనాల సంఖ్య ఎక్కువ ఉండడంతో ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి.
- టూమ్స్ చౌరస్తా–షేక్‌పేట్ ప్రధాన రహదారిపై మసీదు ముందు ఉన్న యూ టర్న్‌లు అక్రమ పార్కింగ్‌లకు నిలయంగా మారింది. ఉదయం 8 నుంచి అర్ధ రాత్రి వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఈ యూటర్న్ వద్ద పార్కు చేసి ఉంటున్నాయి. గుల్షన్ కాలనీ నుంచి టోలి చౌకీ వెళ్లే వారు ఈ యూటర్న్ వద్దే మలుపు తీసుకుంటారు. అయితే కార్లు, ఆటోలు ఈ యూటర్న్ గూండా పోలేని పరిస్థితి ఉంది. యూటర్న్‌ల వద్ద ప్రమాదాలను నివారించడంతో పాటు అక్రమ పార్కింగ్‌లను నియంత్రించడానికి ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

తప్పులు లేకుండా ఓటర్ జాబితా రూపొందించాలి



డీసీ డీడీ నాయక్‌తో మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

చార్మినార్: బూత్ స్థాయి అధికారులు తప్పులు లేకుండా ఓటర్ జాబితాలను రూపొందించాలని చార్మినార్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ సూచించారు. గురువారం చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమీషనర్ డీడీ నాయక్ ఆధ్వర్యంలో మొగల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన సముదాయంలోని కార్యాలయంలో ఓటర్ల జాబితా,సవరణ తదితర అంశాలపై జరిగిన సమావేశంలో ఆయన మరో కాంగ్రెస్ పార్టీ నాయకులు మూసా ఖాసీంతో కలిసి పాల్గొని పలు సూచనలు చేశారు.

ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి



కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సుల్తాన్‌బజార్: గతంలో సీఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన రెండవ ఏఎన్ఎం సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సమ్మె కాలంలో డీహెచ్‌తో సెప్టెంబర్ 1న జరిగిన చర్చలో భాగంగా 2వ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించడంతో పాటు 100 శాతం గ్రాస్ శాలరీ ఇప్పించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేటి వరకు ఆ కమిటీ సమావేశం కాలేదన్నారు. త్వరితగతిన సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏఎన్ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీని ఇచ్చే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ సమస్యలపై నూతన ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యలు నివేదిస్తామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, శ్యామల, జయమ్మ, జ్యోతి, తస్వీర్ సుల్తానా, పద్మ, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు పలువురి శుభాకాంక్షలు





నాంపల్లి: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముజీబుద్దీన్, టీపీసీసీ కార్యదర్శి షేక్ ముఖ్తార్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

- రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పౌర సంబంధాల శాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఐ అండ్ పీఆర్ డిపార్ట్‌మెంట్ రికార్డు అసిస్టెంట్ డాక్టర్ ఎస్.ఎస్.కె.రాజు రాష్ట్ర మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



అబిడ్స్: ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీకే మూర్తి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చురుగ్గా సీవరేజ్ పైప్‌లైన్ పనులు



చార్మినార్: జలమండలి ఆధ్వర్యంలో దూద్‌బౌలీలో రూ.2.50 లక్షలతో కొత్తగా సీవరేజ్ పైప్ లైన్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని మజ్లిస్ పార్టీ యువజన నాయకులు ఆర్.దీపేష్ రాజ్ వర్మ తెలిపారు. గురువారం దూద్‌బౌలీ క్రాస్ రోడ్డు నుంచి కింగ్ హోటల్ రోడ్డులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ పర్యవేక్షణలో నూతనంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున కొత్తగా ఈ సీవరేజ్ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు.

నేడు అయ్యప్ప స్వామి మహాపడి పూజ

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 15వ తేదీన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కిశోర్ కుమార్ గురు స్వామి ఆధ్వర్యంలో ఈ అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఉంటుందన్నారు.

అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: విజయనగర్ కాలనీలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్యాలెంట్ సెర్చ్‌లో భాగంగా రన్నింగ్ రేస్ పోటీలు నిర్వహించారు. ఇందులో నిత్యసాయి మొదటి ప్రైజ్ దక్కించుకుంది. ఈ సందర్భంగా షిష్టర్ ఆరోఖ్య మేరి చిన్నారిని అభినందించారు.

సీఐటీయూ నాయకుల రాస్తారోకో

రాజేంద్రనగర్: పార్లమెంటుకు భద్రత కల్పించలేని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజుల రుద్ర కుమార్ అన్నారు. రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి నేషనల్ పోలీసు అకాడమీ హైవే రోడ్డుపై గురువారం రాస్తారోకో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని సరైన మార్గంలో నడిపించే విధంగా దేశ భవిష్యత్తు కోసం నిధులు, నియామకాలు విధి విధానాలు చర్చించి సరైన దారిలో పెట్టే పార్లమెంటుకి భద్రత కరువైందన్నారు.ఈ దాడిని సీఐటీయు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు భద్రత వైఫల్యాలకు ఇది నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్ష్య సాధింపులు మానుకొని రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాజేంద్రనగర్ మండలం నాయకులు శ్రీకాంత్, గుండప్ప, నారాయణ, జగన్, అబ్దుల్ రహీం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

విజయన గర్‌కాలనీ: ప్రైవేటు సంస్థల్లోని 200 ఉద్యోగాల భర్తీకి శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి నందిగామ మైత్రిప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో, జీడీఏ ప్రైవేటు లిమిటెడ్, అవాసా కన్సల్టెన్స్, డాన్‌బాస్కో నెట్‌వర్క్, బాస్కో సేవా కేంద్ర తదితర సంస్థలలోని ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండి 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఫోటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 83284 28933 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మార్ఫింగ్ ఫొటోలతో వేధింపులు.. వ్యక్తి అరెస్ట్

హిమాయత్‌నగర్: ఇన్‌స్టాగామ్ ప్రొఫైల్స్ నుంచి ఓ మహిళ ఫొటోలను సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి వేధిస్తున్న వ్యక్తిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర జాయింట్ సీపీ డాక్టర్ గజారావు భూపాల్ తెలిపిన మేరకు.. హుస్నీఆలం ప్రాంతానికి చెందిన మనీష్ వర్మ ఇన్‌స్టాగామ్ నుంచి పలువురు యువతుల, మహిళల ఫొటోలను సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి తాను అడిగినంత డబ్బులు ఇవ్వాలని లేదంటే.. వాటిని వారి స్నేహితులకు, బంధువులకు పంపిస్తామని, పోర్న్ సైట్లలో పెడతామని బెదిరిస్తున్నాడు. గత నెల 23న ఓ బాధిత మహిళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కజిన్ వాట్సప్ డీపీ పెట్టుకొని మోసం...

నగరానికి చెందిన ఓ యువతిని సైబర్ కేటుగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన మేరకు.. ఓ యువతి తన బంధువు (కజిన్) వాట్సాప్ ఫొటోను సేకరించి డీపీగా పెట్టుకుని అత్యవసరంగా డబ్బులు కావాలని అడిగారు. వెంటనే తన బంధువే అనుకొని వారు అడిగిన రూ.1.34 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేసింది. అనంతరం తన కజిన్‌కి కాల్ చేసి సంప్రదించగా తాను డబ్బులు అడగలేదని చెప్పడంతో మోసపోయానని తెలుసుకొని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.